జాతీయస్థాయిలో అర్హత సాధించిన క్రీడాకారుడు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట జరుగుతున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ కరాటే పోటీల్లో పార్వతీపురం మండలం పెదమరికి ఎంపియుపి పాఠశాల విద్యార్థి హిమరిక నాని మొదటి స్థానం సాధించాండు. ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీలకు అర్హత సాధించినట్లు స్కూల్ గేమ్స్ సెక్రెటరీ డిటి గాంధీ తెలిపారు. విజయం సాధించిన నానికి కరాటే ప్రెసిడెంట్ సిహెచ్ శ్రీనివాసరావు, సెక్రెటరీ బి.గోపాల్, కోచ్ ఎస్.నరేష్‌తో పాటు పలువురు అభినందించారు.

ప్రజారక్షణ భేరికి

కదలనున్న ఎర్రదండు

- రేపు విజయవాడలో సిపిఎం బహిరంగ సభ
- పయనమవుతున్న కార్మికులు, కర్షకులు, చిరుద్యోగులు
- విజయనగరం నుంచి రెండు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల నుంచి నేడు ఎర్ర దండు కదలనుంది. సిపిఎం ఆధ్వర్యాన ఈనెల 15న విజయవాడలో జరగనున్న భారీ బహిరంగ సభకు పయనమవుతున్నారు. మంగళవారం సాయంత్రం బస్సులు, రైళ్లలో బయలు దేరనున్నారు. ఎక్కువగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు, స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, చిరువ్యాపారులు, ప్రత్యేకించి మహిళలు కదిలేందుకు సిద్ధమౌతున్నారు. సిపిఎం కార్యకర్తలు, నాయకులు కూడా అధిక సంఖ్యలో కదలనున్నారు. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే ప్రయాణ ఏర్పాట్లు పూర్తయాయి. కొన్ని రైళ్లు రద్దు కావడంతో ప్రత్యామ్నాయంగా ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేసుకున్నారు. వాలంటీర్లుగా వ్యవహరిం చేందుకు ఇప్పటికే కొంతమంది విజయవాడకు చేరుకున్నారు.

అసమానతలు లేని అభివృద్ధి పేరిట సిపిఎం ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోను చేపట్టింది. గతనెల 30 నుంచి మూడు జాతాలు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ప్రారంభమయ్యాయి. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో ప్రారంభమైన ప్రజా రక్షణ భేరి యాత్ర పాలకొండ, కురుపాం, పార్వతీపురం, సీతానగరం, మక్కువ, సాలూరు, మెంటాడ, గజపతినగరం, బుడతనాపల్లి, బొడ్డవర జంక్షన్ల మీదుగా మూడు రోజులపాటు సాగింది. అటు శ్రీకాకుళం నుంచి ప్రారంభమైన మరో యాత్ర పూసపాటిరేగ, విజయనగరం, భీమిసింగి, జామి మీదుగా ఎస్.కోట, కొత్తవలస వరకు సాగింది. ఈ సందర్భంగా యాత్రలో పాల్గొన్న సిపిఎం నాయకులకు వివిధ వృత్తులు, సామాజికవర్గాలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, చిరుద్యోగులు, స్కీమ్‌వర్కర్లు, కార్మికులు, గిరిజనులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. తమ సమస్యలను ఏకరువు పెడుతూ పరిష్కారానికి పాలకులపై పోరాడాలంటూ విన్నవించారు. ఇందుకు సిపిఎం నాయకులు కూడా హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో యాత్రల ముగింపు సందర్భంగా విజయవాడలో సిపిఎం ఆధ్వర్యాన జరుగనున్న భారీ బహిరంగ సభకు తరలిరావాలంటూ నాయకులు పిలుపు నిచ్చారు. ఈ నేపథ్యంలో సభను జయప్రదం చేయసేందుకు జిల్లాల్లో సిపిఎం నాయకులు ఆటో, బైకు ప్రచారాలు చేపట్టారు. పలుచోట్ల ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఫలితంగా జనంలో సిపిఎం చూపుతున్న ప్రత్యామ్నాయ విధానాలపై చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో సిపిఎం శ్రేణులతోపాటు అభిమానులు, వివిధ తరగతులకు చెందిన ప్రజానీకం విజయవాడకు పయనమౌతున్నారు. పలు రైళ్లు రద్దు కావడంతో విజయనగరం, గరివిడి ప్రాంతాల నుంచి రెండు ప్రత్యేక బస్సులు బయలదేరనున్నాయి. వీటిని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్య నారాయణ మంగళవారం సాయంత్రం జెండా ఊపి ప్రారంభించ నున్నారు. మిగిలినవారు అందుబాటులో ఉన్న రైళ్లు, ఆర్‌టిసి బస్సులు, ప్రైవేటు వాహనాల్లో కదిలేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు సమాచారం. అటు పార్వతీపురం జిల్లా నుంచి కూడా అధిక సంఖ్యలో కదల నున్నారు. పార్వతీపురం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం తదితర ప్రాంతాల నుంచి ఎక్కువ మంది కదిలేందుకు సన్నద్ధమయ్యారు. అటు గిరిజన ప్రాంతం, ఇటు మైదాన ప్రాంతం నుంచి కూడా పయనమౌతున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు స్పష్టం చేశారు. సభకు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు హాజరు కానున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు ప్రత్యామ్నాయ విధానాలు ఉంచడంతో పాటు ఆయా ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేసి, పాలకులకు హెచ్చరిక చేస్తారని నాయకులు చెబుతున్నారు. ప్రజలకు జరుగుతున్న కష్టనష్టాలపై మరో పోరుకై పార్టీ కేడర్‌కు దశ, దిశ నిర్దేశం చేయనున్నారు. ఇక జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా తోటపల్లి, జంఝావతి, తారకరామ తీర్థసాగర్ పూర్తికి నిధులు కేటాయించాలని ఇటీవల జిల్లాలో సాగిన ప్రజారక్షణ భేరీ యాత్రలో బృందం నాయకులు డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టం, పీసా, 1/70 చట్టం పరిరక్షణకు పోరాడుతామని గిరిజనులకు హామీ ఇచ్చింది. జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్, చక్కెర తెరిపించాలని డిమాండ్ చేసింది. ముఖ్యంగా ఉపాధి హామీ చట్టంలో భాగంగా ఏడాదికి 200రోజులు పని కల్పించడంతోపాటు రోజుకు రూ.600 వేతనం అందజేయాలని కోరింది. ఇలా ప్రాంతం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తించిన అనేక సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా పోరాటాలు నడుపుతామని సిపిఎం నాయకులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో బహిరంగ సభకు మంచి స్పందన లభిస్తోంది.

పార్వతీపురం నుంచి విజయవాడ బయలు దేరిన రెడ్‌షర్ట్ వాలంటీర్లు

సిపిఎం ప్రజా రక్షణభేరి బహిరంగ సభలో రెడ్ షర్టు వాలంటీర్ల కవాతుకు పార్వతీపురం నుంచి పలువురు యువకులు విజయవాడకు బయలుదేరి వెళ్లారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన 37 మంది యువ వాలంటీర్లు, ఐదుగురు మహిళా వాలంటీర్లు బహిరంగ సభ ర్యాలీలో రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతులో పాల్గొంటారు. యువజన, విద్యార్థి సంఘాల నాయకులు రాజు, పండు, సింహాచలం, తిరుపతిరావు, ప్రభాకర్, గంగారావు వీరికి టీం లీడర్లుగా బాధ్యత వహించారు.

కందిపప్పు @ రూ.200

ప్రజాశక్తి - కురుపాం

సామాన్య, మధ్యతరగతి పేదల కుటుంబాల్లో పప్పు ఉడకడంలేదు. కందిపప్పు ధర ఆకాశాన్నంటడమే దీనికి కారణం. మార్కెట్ మాయాజాలంలో కందిపప్పు ధర ప్రస్తుతం కిలో రూ.200 పలుకుతుంది. నిన్నటి దాకా టమాటా కొండెక్కింది. ప్రస్తుతం ఉల్లి ఘట్టెక్కింది దానికి తోడు కందిపప్పు ధర సగటు మనిషిని కలవరపెడుతుంది. వీటితో పాటు నిత్యావసరాల ధరలు చూసి 40 ఏళ్ల క్రితం ఓ ప్రజాకవి రాసినట్లు ఏం కొనేటట్టు లేదు... ఏం తినేటట్టు లేదు పాట గుర్తుస్తుంది. కందిపప్పు సరసన మినపప్పు ధర కూడా చేరింది.

రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయాలి : సిపిఎం

రేషన్ సరుకుల ద్వారా కందిపప్పు సరఫరా చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు కోరారు. పేదలకు కందిపప్పు అందకపోవడంతో ధరలు అధికంగా పెరిగాయి. కందితో పాటు, మినపప్పు ధరలు పెరగడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల కందిపప్పు ఎండిఎం వాహనం ద్వారా పంపిణీ చేసిందిగా కోరారు. ఎండిఎంల ద్వారా కొద్దిమందికే కందిపప్పు అందుతుందని, మిగిలిన వారికి అందడంలేదన్నారు. పప్పులతో పాటు నూనెలు, తదితర 18 రకాల నిత్యావసర సరుకుల ఎండిఎం వాహనాల ద్వారా ప్రజలకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చెరువు గండిని పరిశీలించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రామ వరం వద్ద మాది నాయుడు చెరువు సోమవారం గండి పడింది. దీంతో కోసిన వరిసేలు తడిచిపోగా, చెరువులో చేపలు బయటకు పోతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు చెరువు గండిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తిస్థాయిలో గండిని పూడ్చి రైతులను, మత్స్య కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నష్టపోయిన మత్స్యకారులకు ప్రభుత్వపరంగా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల ప్రసన్నకుమార్ గ్రామ సర్పంచ్ పెంట సత్యనారాయణ, మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు, ఆర్.వేణుగోపాలనాయుడు, పోలా సత్యనారాయణ, పెద్దబ్బాయి, సురేష్‌తో పాటు రైతులు ఉన్నారు

చెరువుకు పడిన గండిని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

పార్వతీపురం, సాలూరులో బైక్ ర్యాలీ ద్వారా ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

చలో విజయవాడకు ప్రజలంతా తరలిరావాలి

ప్రజాశక్తి - బెలగాం

అసమానతల్లేని రాష్ట్రం, జిల్లా అభివృద్ధి కోసం జరిగే సిపిఎం ప్రజారక్షణభేరి ముగింపు బహిరంగ సభ ఈనెల 15న విజయవాడలో జరగనుందని, దీనికి ప్రజలంతా తరలిరావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలో బైకు ర్యాలీ స్థానిక సుందరయ్య భవనం నుంచి ప్రారంభమై కాంప్లెక్స్ మీదుగా నాలుగు రోడ్ల జంక్షన్, రాయగడ రోడ్డు, మార్కెట్ యార్డు మీదుగా బైపాస్ రోడ్డు, బంధం వారి వీధి, పద్మశ్రీ థియేటర్ మీదుగా కలెక్టర్ ఆఫీసు వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా ప్రజా సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని, లౌకిక, ప్రజాస్వామ్య, ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణ, అసమానతల్లేని సమగ్ర అభివృద్ధికి, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా ద్రోహం చేసిన బిజెపి విధానాల్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఎం ప్రజా రక్షణ భేరి యాత్రలో భాగంగా ఈనెల 15న విజయవాడలో జరిగే బహిరంగ సభ కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. కావున అన్ని తరగతుల ప్రజలు విజయవాడకు వెళ్లేందుకు మంగళవారం చలోకి తరలి రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర, వై.మన్మధరావు, జిల్లా కమిటీ సభ్యులు జి.వెంకటరమణ, కె.రామస్వామి, పట్టణ కమిటీ సభ్యులు బంకురు సూరిబాబు, ఎస్.ఉమా, పాకల సన్యాసిరావు, శంకర్రావు. వి.చిన్నంనాయుడు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యాన పట్టణంలో బైక్ ర్యాలీ

సాలూరు: ఈనెల 15న విజయవాడలో సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక సిపిఎం నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని రాజేశ్వరరావు పార్కు నుంచి ర్యాలీని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్ని నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరి యాత్ర ముగించుకొని విజయవాడలో నిర్వహించనున్న బహిరంగ సభకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై అవగాహన కల్పించేందుకు యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. కావున ఈ సభకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు టి.శంకర్, టి.ఇందు పాల్గొన్నారు.

సీతానగరం : ఈనెల 15న విజయవాడలో జరుగు ప్రజా పరిరక్షణభేరి, బహిరంగ సభలో ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం మండల కమిటీ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని పలు గ్రామాల్లో బైక్ ప్రసారం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి లక్ష్మనాయుడు, మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, మండల కమిటీ సభ్యులు జి.వెంకటరమణ, ఆర్.రాము, రెడ్డి రమణమూర్తి, సిహెచ్.కృష్ణ, వై.రామారావు, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చారు... స్థలం మరిచారు?

జగనన్న ఇళ్ల కల నెరవేరేనా! • అడ్డొస్తున్న కులవివక్ష

ప్రజాశక్తి-గరుగుబిల్లి

నిలువ నీడ లేని నిరుపేద కుటుంబాలు నివాసం ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర, ప్రభుత్వం చేపడుతున్న సొంతళ్ల నిర్మాణాలు పేదలకు కలగానే మిగిలింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో పేదలందరికీ సొంతిల్లు ఏర్పాటు చేసేందుకు వైసిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం అందరికీ తెలిసిందే. అర్హులైన నిరుపేదలకు ఇళ్లు, అలాగే స్థలాల మంజూరుకు ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా కార్యక్రమాన్ని ప్రారంభించింది. అంత వరకూ బాగానే ఉంది. పేదలకు పట్టాలైతే ఇచ్చారు కానీ స్థలం ఎక్కడ కేటాయించారన్నదే తెలియక లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు. ఇప్పటి వరకూ అధికారులు, పాలకులు తక్షణమే మంజూరైన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని చెబుతూనే వస్తున్నారు. అయితే ఇందుకు భిన్నంగా మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు పట్టాలైతే ఇచ్చారు కానీ ఇప్పటి వరకూ స్థలం ఎక్కడన్నది చూపని పరిస్థితి. మాకు పట్టాలివ్వాలని లబ్ధిదారులు పలుమార్లు అధికారులకు వినతులు అందించినా ఫలితం శూన్యం. కులవివక్ష వల్లే పట్టాల మంజూరులో జాప్యం జరుగుతోందన్న ప్రచారం మరోవైపున జరుగుతుంది. ఒకవైపు లక్ష్యాలు జిల్లా ప్రథమ స్థానంలో ఉందని చెప్పుకుంటున్న అధికారులు మరోవైపున ఇప్పటికీ ఇళ్లు నిర్మించుకొనేందుకు కనీసం స్థలం ఎక్కడుందో చూపని పరిస్థితి మండలంలోని ఉల్లిభద్రలో నెలకొంది.

మండలంలోని ఉల్లిభద్ర గ్రామానికి చెందిన 10 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. అయితే లబ్ధిదారుల్లో ఐదుగురు బిసి, ఐదుగురు దళిత సామాజికవర్గాలకు లబ్ధిదారులకు దళితకాలనీలో స్థలం మంజూరు చేయగా, మిగిలిన ఐదు ఎస్‌సి లబ్ధిదారులకు బిసి కాలనీలోని ఖాళీ స్థలాల్లో పట్టాలిచ్చారు. అయితే బిసి కాలనీలో ఎస్‌సి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం పట్ల ఆ గ్రామ బిసి అభ్యంతరం వ్యక్తం చేయడంతో స్థలాల మంజూరు ప్రక్రియ నిలిచిపోయినట్టు ఎస్‌సి లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. అర్హులను గుర్తించి వారికి పట్టాలు మంజూరు చేసినప్పుడు రాని అభ్యంతరం స్థలాల కేటాయింపునకు వచ్చేసరికి అభ్యంతరాలు తెలపడం ఎంత వరకు సమంజసమని పలువురు దళితులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు తక్షణమే ఇళ్ల స్థలం మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఆశ తీరేది ఎన్నడు....

పట్టాలు వచ్చాయని సంబరపడడం అయోమయంలో ఉన్నాం. పేదవారికి పట్టాలు పంపిణీ చేసిన అధికారులు, ప్రజా ప్రతినిధులు స్థలం ఎక్కడుందన్న చూపించకపోవడం ఎంతో బాధాకరమైన విషయం

ముదిదాపు సుమతి, జగనన్న కాలనీ పట్టాదారు

లాటరీ పద్ధతి ద్వారా ఇస్తాం

పేదలందరికీ ఇళ్లకు కేటాయించిన స్థలాల్లోనూ, అలాగే గ్రామకంఠానికి సంబంధించిన స్థలంలో సుమారు ఎనిమిది మంది వరకు గోసాలలకై నిర్మాణాలు చేపట్టడం జరిగింది. మరికొంత స్థలం ఆక్రమణలో ఉన్నట్టు సమాచారం. వీటిని తొలగించి అర్హులైన వారికి కేటాయిస్తాం. గ్రామ సభ పెట్టి లాటరీ పద్ధతిలో అర్హులకు కేటాయించిన ఈ స్థలంలో ఎక్కడ స్థలం వస్తే అక్కడే ఇళ్లు నిర్మించుకోవాలి.

- పిఎస్ఎల్ఎన్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్.

ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూమి

మండలాన్ని వీడని గజరాజులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని గొల్లవానివలస, గొట్టివలస, దలైవలస, టిఆర్‌ఎన్‌వలస, ఉల్లిభద్రలో గత కొన్ని రోజులుగా సంచరిస్తున్న ఏనుగుల గుంపు సోమవారం నందివానివలస గ్రామ పరిధిలో సంచరించడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని గత రెండు రోజుల నుంచి బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. అడవులను వీడి జనావాసాల్లో సంచరించడంపై ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు వీటిని అడవులకు ఎందుకు తరలించట్లేదని, ఇప్పటి వరకు కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి వీటిని గ్రామీణ ప్రాంతాల్లో సంచరించేలా చర్యలు చాపాడుతున్నారే తప్ప అటవీ ప్రాంతానికి తరలించడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఏనుగులు వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోయి, పంట నష్టం జరిగిన విషయం ప్రభుత్వం దృష్టిలో ఉన్నప్పటికీ, వీటిని తరలించే విషయంలో చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు ఏనుగులను అటవీ ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నందివానివలసలో సంచరిస్తున్న ఏనుగులు

టిడిపి హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పట్టణంలో ఇటీవల వైసిపి మంత్రులు, ప్రజాప్రతినిధులు నిర్వహించిన సాధికారత సామాజిక బస్సు యాత్ర వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అయినా ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించే పచ్చని చెట్లను మాత్రం నరికివేశారని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు విమర్శించారు. సోమవారం ఆయన తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బస్సు యాత్ర సందర్భంగా వైసిపి నాయకులు టిడిపి హయాంలో నియోజకవర్గం అస్సలు అభివృద్ధి జరగలేదనే అసత్య ఆరోపణలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. టిడిపి ఐదేళ్ల పాలనలో సీతానగరం, పార్వతీపురం ఫ్లైవోవర్లు పూర్తి చేసి ప్రజలకు రైల్వేగేట్ల కష్టాల నుంచి గట్టెక్కించిన విషయం నాయకులకు తెలియకపోయినా ప్రజలకు గుర్తుందన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో అప్పటి సేవలు, ఇప్పటి సేవలను రోగులు నిత్యం బేరీజు వేసుకుంటున్నారని, వంద పడకల ఏరియా ఆసుపత్రిలో 150 పడకలకు అనుమతులు నిధులు తామే తీసుకువచ్చిన సంగతి గుర్తుంచుకోవాలన్నారు. మున్సిపాలిటీలో రక్షిత నీటి కోసం రూ.66కోట్లు మంజూరు ఎవరి హయాంలో జరిగిందో తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు స్థలం మంజూరులో ఉన్న ఆవరోధాలను తొలగించి రూ.6.17లక్షలతో నిర్మాణం పూర్తిచేయడమే కాకుండా ప్రారంభోత్సవం కూడా చేశామని చెప్పారు. తోటపల్లి జలాశయంతో పాటు నారాయణపురం, గెడ్డలుప్పి వంతెనల పనులు ఎవరి హయాంలో ప్రారంభమైనాయో, సీతానగరం రహదారి వంతెన ఎవరు ఆలస్యం చేశారో నియోజకవర్గ ప్రజలకు తెలుసునని సత్యదూరమైన ఆరోపణలు మానుకొని వారి హయాంలో చేసిన అభివృద్ధి పనులు గురించి మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ శ్రీదేవి పాలనలో పట్టణంలోని 30 వార్డుల్లో రూ.5కోట్ల విలువైన రహదారులు, కాలువలు నిర్మించామని, నియోజకవర్గ అభివృద్ధి మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు, బొబ్బిలిరాజులు ఎంతగానో సహకరించారని, వీటన్నింటినీ మరిచి ప్రజల ముందు అబద్ధాలు మాట్లాడితే అంగీకరిస్తారని అనుకోవడం పొరపాటని, దీని సమాధానం త్వరలోనే ప్రజలు ఓట్ల రూపంలో చెబుతారని స్పష్టం చేశారు.

రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

స్థానిక జిల్లా కేంద్రాసుపత్రిని ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం సందర్శించారు. డ్యూటీ వైద్యులు డాక్టర్ రవికుమార్‌తో కలిసి పలు వార్డులో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి రోగుల ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వీరికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. రోగులతో మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని విధాలా మీకు అండదండగా నిలిచి ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఆసుపత్రి వైద్య అధికారులు, వైద్యులు, సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అడ్డాపుశీలలో వరికోతల్లో బిజీగా ఉన్న రైతులు

ప్రారంభమైన వరికోతలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని పలు గ్రామాల్లో తేలికరకాలు పండించిన వరి రైతులు ఈ పంట పొలాల్లో కోతలు ప్రారంభించారు. సోమవారం అడ్డాపుశీల, గోపాలపురం, కృష్ణపల్లి, ఎల్‌ఎన్‌పురం, చినబొండపల్లి గ్రామాల్లో చాలా చోట్ల వరికోతలు ప్రారంభించడమే కాకుండా యంత్రాలతో నూర్పిడులకు సమాయత్త మౌతున్నారు. వరికోతలు ప్రారంభమౌతున్న దృష్ట్యా అధికారులు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, రైతులు కోరుతున్నారు. ఆర్‌బికెల ద్వారా ధాన్యం సంచులు ముందుగానే అందుబాటులోకి తీసుకొస్తామని జిల్లా అధికారులు ప్రకటించినప్పటికీ మండలంలోని ఏఒక్క రైతుభరోసా కేంద్రంలోనూ గోనె సంచులు గానీ, టార్పాలిన్లు గానీ అందుబాటులోకి లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అధికారులు అప్రమత్తమై కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడమే కాకుండా గోనె సంచులు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

వెంకటబైరిపురంలో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ చేపడుతున్న రహదారి మరమ్మతులు

గ్రామాల అభివృద్ధికి 'ఎంఎస్ఆర్ ' కృషి

ప్రజాశక్తి - మక్కువ

ఎమ్మెస్సార్ ఫౌండేషన్ గ్రామాల్లోని అభివృద్ధి పనులు చేపడుతోంది. మండలంలోని వెంకటబైరిపురం పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ అందరితోను అభినందనలు అందుకుంటోంది. వెంకటబైరిపురం కేంద్రంగా ఆ సంస్థ ఎమ్మెస్సార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎం.శ్రీనివాసరావు గ్రామంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా ప్రభుత్వాలు చేయాల్సిన పనులను కూడా తన సంస్థ ద్వారా పనిచేస్తూ అందర్ని ఆదుకుంటున్నారు. గ్రామంలో భారీగా ఏర్పడిన గోతులను ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోకపోయినా తన సొంత నిధులను ఖర్చు చేసి గ్రామంలో గోతులు లేకుండా ఆదివారం నుంచి పనులు చేస్తున్నారు. రహదారి గుండా పార్వతీపురం, సీతానగరం, బొబ్బిలి తదితర ప్రాంతాలకు వెళ్తున్న వాహన చోదకులు కూడా ఎమ్మెస్సార్ ఫౌండేషన్ చేస్తున్న పనులను మెచ్చుకుంటున్నారు. కోట్లాది రూపాయలు కలిగివున్న సేవ చేసే గుణం లేని వారు ఎందరు ఉన్నా ప్రయోజనం ఏముందని, ఎమ్మెస్సార్ ఫౌండేషన్ లాంటివారు మండలానికి ఒక్కరు చాలన్న అభిప్రాయాన్ని ఈ ప్రాంత ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

రాజన్నదొరకు వినతిని అందజేస్తున్న ఆపస్ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి
డిప్యూటీ సిఎంకు ఆపస్ నాయకుల వినతి

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆపస్ జిల్లా నాయకులు డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరకు వినతిపత్రం అందజేశారు. ఆపస్ రాష్ట్ర సహాధ్యక్షులు జాగాన రామునాయుడు, జిల్లా అధ్యక్షులు సాదాపు శ్రీనివాసరావు, కార్యదర్శి నాలి చంద్రశేఖర్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు మంత్రి రాజన్నదొరను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన జిపిఎస్ స్థానంలో ఒపిఎస్ అమలయ్యేలా చూడాలని కోరారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల ఉపాధ్యాయులపై పెనుభారం పడుతోందని చెప్పారు. విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి సక్రమంగా లేదన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా చెల్లించేలా చూడాలని మంత్రి రాజన్నదొరను కోరారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు.

నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి ఎం.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, 16న జాతీయ గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ఎస్సార్ రంగనాథ్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్యను స్మరించడం, 17న 6,7 తరగతులకు ఇంగ్లీష్ పదాలు రాయడంలో పోటీలు, 18న 8, 9 తరగతులకు క్రీడలు, వాటి ఆవశ్యకత, వ్యాసరచన పోటీలు, కీర్తిశేషులు మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి వేడుకలు, 20న డిజిటల్ లైబ్రరీ వినియోగం ముగింపు కార్యక్రమంతో పాటు బహుమతులు ప్రధానం చేస్తుస్తామని, ఇందులో ప్రతి ఒక్కరూ కార్యక్రమం పాల్గొని విజయవంతం చేయాలని గ్రంథాలయ అధికారి కోరారు.

పార్టీ విజయం కోసం శ్రమించాలి

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ నియోజకవర్గం సీతంపేట క్యాంపు కార్యాలయంలో టిడిపి నాయకులు పడాల భూదేవి మర్రిపాడు, కీసరజోడు పంచాయతీ పరిధిలో ఉన్న యువ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ విజయం కోసం శ్రమించాలని కోరారు. గ్రామాల్లో అభివృద్ధి, వ్యక్తిగత అభివద్ధి కోసం టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఐక్యంతో పార్టీ గెలిపించాలని కోరారు. క్షేత్రస్థాయిలో టిడిపి మేనిఫెస్టివల్ బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గురించి తెలపాలన్నారు. గిరిజనులకు అండగా టిడిపి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సవర మంగయ్య, బిడ్డిక రామకృష్ణ, యువ కార్యకర్తలు ఊయక అప్పన్న, పువ్వల కైలాష్, ఆరిక మురళీ, సవర సుందరరావు, బిడ్డిక సూరయ్య, బిడ్డిక కృష్ణారావు, పాల్గొన్నారు.

పర్యాటకులతో కిట కిట

ప్రజాశక్తి - సీతంపేట

సోమవారం సెలవు దినం కావడం, అందులో కార్తీకమాసం ప్రారంభం కావడంతో స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ పర్యాటకులతో పోటెత్తింది. సోమవారం సెలవు దినం కావడంతో పిల్లలతో కుటుంబ సభ్యులతో సేద తీర్చుకోవడానికి పర్యాటకులు తరలివచ్చారు. జిల్లా నలుమూల నుండే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చారు. పార్క్‌లో ఉన్న ఆందోళన ఆశ్వాదించారు. యువకులు జలవిహార వద్ద బోటు షికారు చేశారు. చిన్నారులు బోట్లో సిమ్మింగ్ చేశారు. మినీ ట్రైన్ ఎక్కి ఎంచక్కాగా ఆడుకున్నారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర కొట్టారు. పార్కులో పర్యాటకులు చుట్టుముట్టి కనువిందు చేసుకున్నారు. ఆనంద్ విహార వద్ద డాన్సులు వేసి కేరింతలు కొట్టారు.

'దుమ్ము'ఎత్తి పోస్తున్న వీరఘట్టం

- ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచని ప్రధాన రహదారి
- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు

ప్రజాశక్తి - వీరఘట్టం

పేరుగొప్ప... ఊరుదిబ్బ అన్న చందంగా వీరఘట్టం గ్రామ పరిస్థితి. ఈ గ్రామం ప్రధాన రహదారి అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రతిరోజు వందలాది భారీ వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి దుమ్మెత్తడంతో రోగాల బారిన పడుతున్నట్లు ప్రజలు, వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వట్టిగెడ్డ వంతెన నుండి స్వామి థియేటర్ వరకు 1.2 కిలోమీటరు దూరంలో రూ.5.5 కోట్లతో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు గత ఏడాది ఫిబ్రవరి 19న అంబేద్కర్ జంక్షన్ వద్ద స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్‌లు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి దాదాపు 21 నెలలు కావస్తున్నప్పటికీ రోడ్డు విస్తీర్ణ అభివృద్ధి పనులు జరగకపోవడంతో స్థానికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఆర్భాటంగా శంకుస్థాపన చేసి ఉపన్యాసాలు చేసి వెళ్లారే తప్ప రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. కలెక్టర్‌తో సహా జిల్లా ఉన్నతాధికారులు పాలకొండ, సీతంపేట తదితర మండలాలకు వెళ్లేటప్పుడు వీరఘట్టం ప్రధాన రహదారి గుండానే రాకపోకలు సాగించాలి. అయినా ఈ రోడ్డు పరిస్థితిని ఎవరూ పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు. అలాగే ఒడిస్సా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర అంతర్ రాష్ట్రాలకు ఇదే రహదారి గుండా భారీ వాహనాలతో ఫ్యాక్టరీలకు ముడిసరుకులు తరలిస్తున్నారని, అలాగే గతనెల అక్టోబర్ 20న అంబేద్కర్ జంక్షన్ వద్ద భారీ కంటైనర్ మరమ్మతులకు గురై రహదారికి అడ్డంగా నిలిచిపోవడంతో వందలాది వాహనాలు అటు వీరఘట్టం నుంచి పాలకొండ వైపు ఇటు వీరఘట్టం నుంచి పార్వతీపురం వైపు వాహనాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ప్రధాన రహదారి దుమ్ము ధూళితో పాటు పెద్ద పెద్ద పిక్కరాళ్లు పైకి తేలడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అప్పుడప్పుడు ట్యాంకర్ల ద్వారా దుమ్ము ఎగరకుండా ఉండేందుకు నీటితో రహదారిని తడుపుతున్నప్పటికీ పెనం మీద నీళ్ల చల్లినట్లు ఉంటుందని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అర్ధాంతరంగా నిలిపివేసిన ప్రధాన రహదారి విస్తరణ అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాహనాల రాకపోకలతో రేగుతున్న దుమ్ము, ధూళి

నేడు రిటైర్డ్ పెన్షన్ దారుల సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రిటైర్డ్ పెన్షనర్‌దారుల సమావేశం మంగళవారం జరుగుతుందని ఆ సంఘం కార్యదర్శి డి.గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బెలగాంలో గల రైతు బజార్ వెనుకనున్న రిటైర్డ్ పెన్షనర్‌దారుల సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు స్థానిక సబ్ ట్రెజరీ పరిధిలోగల రిటైర్డ్ పెన్షన్ దారుల నెలవారీ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి రిటైర్డ్ పెన్షన్‌దారులంతా తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

నియోజకవర్గ జనసేన సమన్వయకర్తల నియామకం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్ /గుమ్మలక్ష్మీపురం

ఉమ్మడి విజయనగరం జిల్లా జనసేన 9 నియోజకవర్గాల సమన్వయకర్తల నియామకం జరిగింది. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం విడుదల చేసింది. చీపురుపల్లి నియోజకవర్గానికి విసినిగిరి శ్రీనివాసరావు, గజపతినగరానికి మర్రాపు సురేష్, కురుపాం(ఎస్టీ) కడ్రక మల్లేశ్వరరావు, పార్వతీపురం(ఎస్సీ) ఆదాడ మోహన్ రావు, ఎస్ కోట వబ్బిన సత్యనారాయణ, సాలూరు (ఎస్టీ) గేదెల రవీవర్దన్, విజయనగరం పాలవలస యశస్వి, నెల్లిమర్ల లోకం నాగ మాధవి, బొబ్బిలి గిరడ అప్పలస్వామి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పార్టీ అభివృద్ధికి కృషి

గుమ్మలక్ష్మీపురం : ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కి కృషి చేస్తానని చెప్పారు.

నేమ్ బోర్డులో జిల్లా పేరు మార్పు
'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని హుస్సేన్‌పురం సచివాలయ నేమ్ బోర్డులో శ్రీకాకుళం జిల్లా పేరును తొలగించి పార్వతీపురం మన్యం జిల్లాగా సోమవారం సచివాలయ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద నేమ్‌బోర్డులను మార్చకపోవడం పట్ల ఈనెల 12న ఇంత నిర్లక్ష్యమా? అన్న ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు.

పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సుందరరావు

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని అడ్డాపుశిలలో ఎన్ఐఆర్ మోహన్ సుధీర్ పట్టా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో దీపావళి సందర్భంగా గ్రామానికి చెందిన పేదలకు, చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. నిర్వాహకులు అక్కేన సుందరావు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 50మంది వృద్ధ మహిళలకు చీరలు, దుప్పట్లు, మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పేద బాలబాలికలకు నూతన దుస్తులతో పాటు, బిస్కెట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా సుందరరావు మాట్లాడుతూ తమ గ్రామం కాకపోయినా సేవా దృక్పథంతో అడ్డాపుశిల అభివృద్ధికి సహకరిస్తూ, పేదల సంక్షేమం కోసం పరితపిస్తున్న సుధీర్‌పట్టా సేవలను గ్రామస్తులు చిరకాలం గుర్తుంచుకుంటారని అన్నారు.

సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యాశాఖ పరిధిలో గల సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి నాయకులు బివి రమణ, బి.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జెఎసి నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నదని విమర్శించారు. విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అందరికీ మినిమం టైమ్ స్కేల్, హెచ్ఆర్ఎ, డిఎ అమలు చేయాలని, ప్రస్తుతం ఉన్న పార్ట్‌టైమ్ విధానం రద్దు చేసి ఫుల్ టైం కాంటాక్ట్ విధానం అమలు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్ గ్రాడ్యుటీ రూ.10 లక్షలు చెల్లించాలని, సామాజిక భద్రత పథకాలు ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, మరణించిన వారి కుటుంబాలకు రూ.20 లక్షలు చెల్లించాలని, మరణించిన వారి కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని పోస్టులకు జాబ్‌చార్ట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతం చెల్లించాలని కోరారు. ఈ సమస్యలపై ఇప్పటికే అనేక దఫాలుగా ప్రభుత్వానికి వినతులు అందించామన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేనిచో రాష్ట్రవ్యాప్తంగా జెఎసి ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు డి.గురువులు, వై.గౌరమ్మ, కె.నరసింహాచారి, డి.ఉమామహేశ్వరరావు, క్రాంతి, బి.నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెఎసి నాయకులు బివి రమణ

జగన్ పాలనలో రాష్ట్రం అట్టడుగుకు : టిడిపి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, అభివృద్ధి చెందాలంటే మళ్లీ టిడిపి అధికారంలోకి రావాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం భవిష్యత్తుకు గ్యారంటీ, బాబుషూరిటీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న వ్యాపార వర్గాలను కలుసుకుని వైసిపి నాలుగున్నరేళ్ల పాలనలో ఏపి వర్గాలు ఏవిధంగా నష్టపోయారన్న విషయాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంతో పాటు, నియోజకవర్గంలో అభివృద్ధి ఆనవాళ్లు ఏమీలేకుండా చేశారని, రాబోయే కాలంలో టిడిపి అధికారంలోకి వస్తే చంద్రబాబు నాయకత్వంలో పట్టణానికి పూర్వవైభవం తీసుకొస్తామని గ్యారంటీ ఇస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు జి.రవికుమార్, సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బార్నాల సీతారాం, కోల మధు, పాలకొండ మరియాదాసు, డాక్టర్ భానుప్రసాద్, పోల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు అందజేస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయచంద్ర

పండగ పూటా తాగునీటికి అవస్థలే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాల్టీ పరిధిలో గల పలు వార్డుల్లో దీపావళి పండుగ పూట కూడా పలు వార్డుల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పట్టణంలోని పలు ప్రైవేట్ వాటర్ ప్లాంట్లను తాగునీరు కొరకు ఆశ్రయిస్తుంచారు. ఈనెల 9న మున్సిపల్ పరిధిలో గల 22, 23, 24, 25, 26, 27 వార్డులకు తాగునీటి సరఫరా అందించిన మున్సిపల్ తాగునీటి విభాగం అధికారులు, సిబ్బంది ఆదివారం దీపావళి పండుగ పూట కూడా తాగునీరు సరఫరా చేయకపోవడం చాలా దారుణమని అన్నారు. కనీసం ఆయా వార్డులకు తాగునీటి ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేయడం లేదని ఆయా వార్డుల ప్రజలు అధికారులను బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక పాలకవర్గ కౌన్సిల్ సభ్యులకు చీమకుట్టినట్లైనా లేదని బహిరంగంగానే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కేంద్రంలో పట్టణానికి కూత వేటు దూరంలో నాగావళి నది పరివాహక ప్రాంతమైనప్పటికీ వర్షాకాలంలో రంగు మారిన నీటి సరఫరా, శీతాకాలం, వేసవి కాలాల్లో నాలుగు రోజుకొకసారి చాలీచాలని నీటి సరఫరా జరుగుతుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తాగునీటి సమస్యపై దృష్టి పెట్టి కచ్చితమైన ప్రణాళికను రూపొందించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ట్యాంకు వద్ద నీళ్లు పడుతున్న మహిళలు

మురుగు నీరు వెళ్లేందుకు మార్గమేది?

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలో పారిశుధ్య సమస్య తాండవిస్తోంది. వీరఘట్టంలో ఎక్కడికక్కడే మురికి కాలువలు మూసుకుపోవడంతో వాడుకు నీరు ఎటూ వెళ్లేందుకు మార్గం లేక ఎక్కడికక్కడ నిలిచిపోతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని గెడ్డ కాలనీ, అంధవరపు, దళిత తదితర వీధుల్లో మురుకు నీరు వెళ్లేందుకు కాలువల ఆనవాళ్లు లేకపోవడంతో ఆ నీరు నిల్వ ఉండిపోవడంతో దుర్వాసనతో పాటు వాటిపై దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యం అనారోగ్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ వర్గాలు దృష్టి సారించి కనుమరుగైన కాలువలను సరిచేయడంతో కబ్జాకు గురైన స్థలాలను కాపాడేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై మేజర్ పంచాయతీ ఇఒ వి.రామచంద్రరావు వద్ద కాలువలు కబ్జా గురవుతున్నట్లు ప్రస్తావించగా, పరిశీలించి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అందవరపు వీధిలో నిలిచిపోయిన మురికి నీరు

పెచ్చులూడిపోయిన శ్లాబ్

ప్రమాదం జరిగితే గానీ మరమ్మతులు చేయరా?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ వాణిజ్య సముదాయంలో ప్రమాదం జరిగితే గానీ మరమ్మతులు చేపట్టరా అని మున్సిపల్ వాణిజ్య సముదాయంలో అద్దెకు ఉంటున్న వ్యాపారులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ వాణిజ్య సముదాయాన్ని 2006లో రూ.53 లక్షలతో 50 షాపులను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పడిన మున్సిపల్ కౌన్సిల్ పాలక వర్గం హయాంలో ఐడిఎస్ఎంటి నిధులతో నిర్మించారు. అయితే నిర్మాణం జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు 17 ఏళ్లయినా ఈ వాణిజ్య సముదాయం మరమ్మతుల్లు, కనీస నిర్వహణ పనులను మున్సిపల్ అధికారులు చేపట్టక పోవడంతో వాణిజ్య సముదాయంపై వర్షాలు పడిన సందర్భాల్లో వర్షం నీరు నిల్వ ఉండిపోవడంతో మరమ్మతులకు గురై శ్లాబ్ పెచ్చులు ఊడి ఇనుప గజాలు బయటకు వచ్చి ఎప్పుడు కూలిపోయి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వ్యాపారులు భయాందోళన చెందుతున్నారు. అయినా మున్సిపల్ అధికారులు వాణిజ్య సముదాయం మరమ్మతుల వైపు దృష్టి పెట్టకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. మున్సిపల్ కార్యాలయానికి లక్షలాది రూపాయలు ఆదాయం సమకూరుస్తున్నా ఈ వాణిజ్య సముదాయం అభివృద్ధిపై దృష్టి సారించకపోవడం పట్ల వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే మరమ్మతులు చేపట్టే దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని వ్యాపారులు కోరుతున్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - కురుపాం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి ఆదివారం రాత్రి మన్యం జిల్లా కలింగవైశ్య జిల్లా అధ్యక్షులు, వైసిపి వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళింగవైశ్య కుటుంబ సభ్యులకు దీపావళి, కార్తీకమాస పర్వదినాల శుభ సందర్భాన గతంలో ఈ మూడు జిల్లాల కళింగవైశ్యులను బిసి-డిలో చేర్చితే ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల కళింగవైశ్యులను బిసి-డిలో చేర్చడం హర్షించదగ్గ విషయమని అన్నారు. రానున్న రోజుల్లో రాజకీయ, ఉద్యోగ, వాణిజ్య విషయాల్లో ప్రభుత్వం తరపున అన్ని సౌకర్యాలు పొందేందుకు మార్గం సుగమమైందని, దీనికి తగ్గట్టుగా ప్రభుత్వ సహకరిస్తే కళింగ వైశ్యులకు భవిష్యత్తులు పురోగమిస్తాయినడంలో సందేహం లేదని అన్నారు. కార్యక్రమంలో కళింగవైశ్య సంఘ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకోట సురేష్ కుమార్ , కళింగ వైశ్య పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కళింగ ఆర్య వైశ్య సంఘ నాయకులు

వీరఘట్టం : స్థానిక అంబేద్కర్ జంక్షన్ సోమవారం వైశ్య సంఘం నాయకులు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీరఘట్టం వైశ్య సంఘం నాయకులు బి.సంపత్ కుమార్ మాట్లాడుతూ గతంలో మూడు జిల్లాలకే బిసి ఉప కులాలుగా ఉండేదని ప్రస్తుత ముఖ్యమంత్రి రాష్ట్రమంతటా విస్తరింప చేయడంతో వైశ్యులకు ఎంతో మేలు చేశారని, ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నప్పుడు పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేయడంతో ముఖ్యమంత్రి మేలు ఎప్పటికీ మరచిపోమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో భోగి మాణిక్య చంద్రశేఖర్, కె.ఆంజనేయులు, గుడ్ల గౌరీశంకర్, మూర్తి, ప్రదీప్ కుమార్, తూముల రమేష్, రవిపాత్రుడు, మదిన్ తదితర వైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో ఉన్న చార్మినార్ హెటల్‌లో సోమవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. ఉదయం 5.30 గంటల సమయంలో హెటల్‌లో నుండి మంటలు రావడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షల రూపాయలు ఆస్తి నష్టం వాటిల్లినట్టు అంచనా వేశామని అగ్నిమాపక స్టేషన్ అధికారి యు.సుధాకరరావు చెప్పారు.